క్లుప్తంగా

నూతన వధూవరులకు మంత్రి ఆశీర్వాదం


ఆశీర్వదిస్తున్న మంత్రి దంపతులు

ధర్మపురి: పట్టణంలో ఆదివారం జరిగిన పలు వివాహ వేడుకల్లో మంత్రి కొప్పుల ఈశ్వర్ దంపతులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. సిద్ధం వినయ్ సోదరి వివాహానికి హాజరై ఆశీర్వదింఆచరు. అదే విధంగా ఒడ్నాల వారి పెళ్లి వేడుకలకు మంత్రి దంపతులతో పాటు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హాజరై నూతన వదూవరులను ఆశీర్వదించారు.

బాధిత కుటుంబాలకు చెక్కులు అందజేత


చెక్కులు అందిస్తున్న ఏడీఈ

కథలాపూర్: కోరుట్ల రూరల్ సబ్ డివిజన్ పరిధిలో విద్యుత్ ప్రమాదాలతో ప్రాణాలు కోల్పోయిన, నష్టం జరిగిన బాధిత కుటుంబాలకు ట్రాన్స్‌కో అధికారులు రూ. 10.80 లక్షలు పరిహారం ఆదివారం అందజేశారు. కథలాపూర్ మండలం చింతకుంట గ్రామానికి చెందిన బంటు గంబాలు అనే రైతుకు చెందిన పశువులు మృతిచెందడంతో రూ. 40 వేలు అందించారు. మేడిపెల్లి మండలం కల్వకోటలో నాగెల్లి వనితకు రూ. 5 లక్షలు, విలయాతబాద్‌కు చెందిన పాకాల గంగుకు రూ. 40 వేలు, భీమారం మండలం మోత్కురావుపేటకు చెందిన నాగం లక్ష్మికి రూ. 5 లక్షల చెక్కును ట్రాన్స్‌కో అధికారులు అందించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో కోరుట్ల రూరల్ ఏడీఈ బొప్పరాతి రఘుపతి, ఏఈలు విశ్వతేజ, జమీల్‌పాషా పాల్గొన్నారు.

పద్మశాలీలు అన్నిరంగాల్లో రాణించాలి


రవీందర్‌ను సన్మానిస్తున్న సంఘం సభ్యులు

మల్లాపూర్: పద్మశాలీలు అన్నిరంగాల్లో రాణించాలని భక్త మార్కండేయ పద్మశాలీ సంఘం మల్లాపూర్ అధ్యక్షుడు సిరిపురం రవీందర్ అన్నారు. ఆదివారం మల్లాపూర్‌లో సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సిరిపురం రవీందర్, ఉపాధ్యక్షుడిగా చిప్ప భరత్‌కుమార్, దైవశెట్టిగా పోతు గంగరాంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు రవీందర్ మాట్లాడుతూ పద్మశాలీలు ఐక్యంగా ఉంటూ రాజకీయంగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు.సమావేశంలో పద్మశాలీలు పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు చిరస్మరణీయం


మట్టి సేకరిస్తున్న బీజేపీ నాయకులు

మల్లాపూర్: దేశ రాజధాని ఢిల్లీలో నిర్మించనున్న స్మారక చిహ్నంతో అమరుల త్యాగాలు చిరస్మరణీయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సాంబారి ప్రభాకర్ అన్నారు. ఆదివారం మల్లాపూర్‌లో నిర్వహించిన మట్టి సేకరణలో పాల్గొని మాట్లాడారు. దేశం కోసం అమరులైన వీర జవాన్లు, పోలీసులు, స్వాతంత్ర పోరాట యోధుల జ్ఞాపకార్థం కేంద్ర ప్రభుత్వం ఢిల్లీలో ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న స్మారక వనంలో దేశప్రజలందరూ భాగస్వాములను చేయాలనే ఉధేశ్యంతో మోదీ మట్టి సేకరణ కార్యక్రమానికి పిలుపునిచ్చారన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ముద్దం సత్యనారాయణగౌడ్, జిల్లా కార్యదర్శి ఎర్ర లక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

యువకుల రక్తదానం

మేడిపెల్లి: కరీంనగర్ లోని ఓ ఆస్పత్రిలో మంచిర్యాల జిల్లా గూడెం గ్రామానికి చెందిన నల్లపు ఊశయ్య అనే వ్యక్తికి గుండెసర్జరీకి అత్యవసరంగా రక్తం అవసరం కాగా, సామాజిక మాద్యమాల ద్వారా విషయం తెలుసుకున్న మేడిపెల్లి మండలం కల్వకోట గ్రామానికి చెందిన కట్ట మహేశ్, ఆదె మహేందర్ కరీంనగర్ వెళ్లి రక్తదానం చేశారు. భారీ వర్షంలోనూ రక్తదానం చేసిన మహేశ్, మహేందర్‌ను పలువురు అభినందించారు.

రోడ్లపైనే వారసంతలు

- ఇబ్బందిపడుతున్న క్రయ విక్రయదారులు
- ట్రాఫిక్‌కు అంతరాయం
- సమీకృత మార్కెట్ భవనాలు నిర్మించాలంటున్న ప్రజలు


కవర్ కింద కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారి


వర్షంలో తడుస్తూ కూరగాయలు విక్రయిస్తున్న రైతులు

కథలాపూర్: గ్రామాల్లో కూరగాయాలు, ఇతర నిత్యావసర వస్తువులు అన్ని ఒకేచోట లభించేందుకు వార సంత నిర్వహిస్తారు. ఒక్కో గ్రామంలో ఒక్కో రోజు వార సంత ఉంటుంది. వారసంతలో సాయంత్ర వేళల్లో ప్రజలు ఎక్కువగా వస్తువులు కొనుగోలు చేస్తుంటారు. ఈ వారసంతలు రోడ్డుపై నిర్వహిస్తుండడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. గ్రామాల్లో వారసంత కోసం సమీకృత మార్కెట్ భవనాలు నిర్మిస్తే క్రయ విక్రయదారులకు సౌకర్యంగా ఉంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

కనీస సౌకర్యాలు కరువు

కథలాపూర్ మండలంలో 19 గ్రామాలుండగా... కొన్ని గ్రామాల్లోనే వారసంతలు నిర్వహిస్తున్నారు. కథలాపూర్‌లో ప్రతీ సోమవారం, అంబారిపేటలో మంగళవారం, గంభీర్‌పూర్‌లో శుక్రవారం, పోతారం, భూషణరావుపేట గ్రామాల్లో శనివారం, తాండ్ర్యాలలో ప్రతీ ఆదివారం వారసంత ఉంటుంది. వార సంతల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయని ప్రజలు వాపోతున్నారు. వార సంతలకు దూరప్రాంతాల నుంచి వచ్చేవారు తాగునీరు, మరుగుదొడ్లు లేకపోవడంతో మహిళలు ఇబ్బంది పడుతున్నారు. ఆయా గ్రామాల్లో వార సంతలో లక్షలాది రూపాయలు వ్యాపారం జరుగుతున్నప్పటికీ కనీస వసతులు లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారుల తీరుపై వ్యాపారులు, ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పిస్తే బాగుంటుందని పేర్కొంటున్నారు.

రాకపోకలకు అంతరాయం

ఆయా గ్రామాల్లో వార సంతలు రోడ్డు పక్కనే నిర్వహిస్తుండటం.. కూరగాయలు, నిత్యావసర వస్తువులు, సీజన్‌లో లభించే పండ్లు వంటివి లభిస్తాయి. మధ్యాహ్నం నుంచి రాత్రి 7 గంటల వరకు మార్కెట్లు కొనుగోలు దారులతో కిటకిటలాడుతుంటాయి. దీంతో వారసంత నిర్వహించే రోజు రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఉపాధిహామీలో సమీకృత మార్కెట్ భవనాలు నిర్మించుకోవడానికి నిధులు మంజూరైనా.. వాటి నిర్మాణాలపై పాలకులు, అధికారులు దృష్టిసారించలేదనే విమర్శలున్నాయి. ఇప్పుడు రోడ్డుపై వారసంతలు నిర్వహించడంతో ఇబ్బందులపాలు కావొస్తుందని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ప్రజాప్రతినిధులు, అధికారులు సమీకృత మార్కెట్ భవనాల కోసం స్థలం సేకరించి వాటి నిర్మాణాలపై దృష్టిపెడితే అందరికీ ప్రయోజనం చేకూరుతుందని మండల ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

ప్రమాదాలు జరిగే అవకాశం



ఆరుగాలం శ్రమించి పంటలు పండించిన రైతులు విక్రయించుకోవడానికి వీలుగా వసతులు కల్పించడం ప్రభుత్వం బాధ్యతగా భావించాలి. రోడ్లపై కూరగాయలు విక్రయిస్తే ప్రమాదాలు జరిగే అవకాశాలుంటాయి. కూరగాయలు విక్రయించడానికి వారసంతలకు వెళ్లిన రైతులకు వసతులు కల్పించాలి. అప్పుడే మార్కెట్లు అభివృద్ధి చెందుతాయి. రైతుల సంక్షేమం గురించి ఆలోచించి వారసంతల నిర్వాహణ కోసం సమీకృత మార్కెట్ భవనాలు నిర్మించాలి.

– నరెడ్ల జగన్‌రెడ్డి, రైతు, దూలూర్

వసతులు కల్పించాలి



వార సంతలతో ప్రజలకు అన్ని రకాల వస్తువులు ఒకే చోట అందుబాటులో ఉంటాయి. వారసంత నిర్వాహణ వల్ల రైతులకు ఆర్థికంగా కలిసి రాగా.. ప్రజలకు నాణ్యమైన కూరగాయలు, నిత్యవసరాలు దొరుకుతున్నాయి. పాలకులు వార సంత ఉన్నచోట వ్యాపారులకు, రైతులకు, ప్రజలకు మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలి. దూర ప్రాంతాల నుంచి వార సంతకు వచ్చినవారు మౌలిక వసతులు లేక ఇబ్బందిపడుతున్నారు. ఇకనైనా వసతుల కల్పనపై దృష్టిసారించాలి.

– మామిడిపెల్లి ప్రవీణ్, తాండ్ర్యాల

జోరువాన..


ధర్మపురి ఆలయం ఎదుట నిలిచిన నీరు


దుబ్బలవాడ కాలనీలో నిలిచిన వరద నీరు


ఇప్పపెల్లి శివారులో కోతకు గురైన రోడ్డు


కోనాపూర్ వద్ద ఉప్పొంగుతున్న వాగు


మల్యాలలో ప్రవహిస్తున్న వరదనీరు

ధర్మపురి: పట్టణంలో ఆదివారం మధ్యాహ్నం కుంభ వర్షం కురిసింది. ఒక్కసారి మొదలైన వర్షం కుంభ వృష్టిని తలపించింది. భారీ వర్షంతో రోడ్లు జలమయమయ్యాయి. డ్రెయినేజీలు పొంగి పొర్లాయి. ధర్మపురి శ్రీలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం ముందు వర్షం నీటితో చెరువును తలపించింది. చిరువ్యాపారుల సామగ్రి తడిసిపోయాయి.

కథలాపూర్ మండలంలో 19.8 మి.మీ వర్షం

కథలాపూర్: మండలంలో ఆదివారం 19.8 మి.మీ వర్షం కురిసినట్లు అధికారులు తెలిపారు. మండలంలోని గ్రామాల్లో ఆదివారం ఉదయం భారీ వర్షం కురిసింది. కోరుట్ల– వేములవాడ రూట్‌లో ఇప్పపెల్లి శివారులో గతంలో కోతకు గురైన రోడ్డు మరింత ప్రమాదకరంగా మారింది. ఆ రోడ్డుపై వెళ్లడానికి వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు.

మల్యాల: మల్యాల మండలంలోని వివిధ గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. నిండుకుండలా ఉన్న ఇప్పటికే చెరువులు, కుంటలు ఆదివారం కురిసిన వర్షానికి మరిన్ని వరదనీరు చేరుల్లో చేరి, అలుగుదుంకాయి.

నీట మునిగిన కాలనీలు

వెల్గటూర్: మండలంలో గత రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన కుండపోత వర్షానికి జనజీవనం స్తంభించింది. భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షం ధాటికి మండల కేంద్రం లోని పలు కాలనీలు నీట మునిగాయి. దుబ్బల వాడ కాలనీకి డ్రెయినేజీ సరిగా లేకపోవడంతో వరద నీటితో కాలనీ లోని ఇళ్లన్నీ నీట మునిగాయి. ఇళ్లలో వర్షపు నీరు చేరడంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. భారీ వర్షానికి సహకార సంఘం కార్యాలయం ముందు రోడ్డుపై భారీ వృక్షం కూలడంతో మంచిర్యాల వైపు వెళ్లే వాహనాల రాకపోకలు గంటపాటు నిలిచిపోయాయి. పోలీసులు వచ్చి జేసీబీలతో చెట్టును తొలగించి రాకపోకలు పునరుద్దరించారు. రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

భారీ వర్షంతో పొంగిపొర్లుతున్న వాగులు

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో కురిసిన భారీ వర్షాలకు వాగులు పొంగిపొర్లుతున్నాయి. శనివారం రాత్రి నుంచి ఆదివారం సాయంత్రం వరకు కురిసిన వర్షానికి వాగులు, వంకలు పొంగిపొరుతున్నాయి. నెల రోజులుగా సరియైన వర్షాలు లేక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్న సమయంలో భారీగా కురుస్తున్న వర్షాలతో పంటలపై తెగుళ్ల బెడద తగ్గిపోతుందని పేర్కొంటున్నారు. భారీ వర్షంతో కోనాపూర్ వంతెన వద్ద ఏర్పాటు చేసిన అప్రొచ్ రోడ్డుకు మళ్లీ ప్రమాదం పొంచి ఉందని వాహనదారులు పేర్కొంటున్నారు.

18 గ్రామాలకు విద్యుత్ పునరుద్ధరణ


విద్యుత్ లైన్లు సరిచేస్తున్న అధికారులు,సిబ్బంది

సారంగాపూర్: మండలంలో భారీ వర్షం, ఈదురు గాలులతో చెట్లు విరిగి పడి మండలంలోని మూడు సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిచిపోగా, విద్యుత్తుశాఖ అధికారులు, సిబ్బంది ఎనిమిది గంటల పాటు శ్రమించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. శనివారం సాయంత్రం నుంచి ఈదురు గాలులు, వర్షానికి మండలానికి వచ్చే 33 కేవీ లైన్లపై పలు చోట్ల చెట్లు విరిగిపడి విద్యుత్ లైన్లు తెగిపోయాయి. దీంతో మండలంలోని సారంగాపూర్, లక్ష్మీదేవిపల్లి, రేచపలి సబ్‌స్టేషన్ల పరిధిలోని 18 గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అప్రమత్తమైన ట్రాన్స్‌కో ఏడీఈ హరీశ్, ఏఈ సతీశ్ ఆద్వర్యంలో లైన్‌మెన్లు,లైన్ ఇన్స్‌పెక్టర్లు, జూనియర్ లైన్‌మెన్లు, విద్యుత్తు సిబ్బంది మొత్తం 20 మంది రేచపల్లి, లక్ష్మీదేవిపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని 14 గ్రామాలకు ముందుగా విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. సారంగాపూర్ సబ్‌స్టేషన్‌కు వచ్చే ప్రధాన లైన్‌పై బతుకమ్మ కుంటలో చెట్లు విరిగిపడి లైన్లు తెగిపోయాయి. లైన్లపై పిడుగులు పడి పలు చోట్ల ఇన్సులేటర్లు పగిలిపోయాయి. దీంతో అధికారులు, సిబ్బంది భారీ వర్షంలోనూ లైన్లపై పడ్డ పెద్ద చెట్లను తొలగించి, కొత్త ఇన్సులేటర్లను బిగించి ఎనిమిది గంటలపాటు శ్రమించి ఆదివారం వేకువ జామున 4 గంటలకు విద్యుత్ పునరుద్ధరించారు. దీంతో ఏడీఈ, ఏఈ, సిబ్బందిని స్థానిక ప్రజలు అభినందించారు.

స్వప్నికకు జువ్వాడి అభినందన


స్వప్నికను అభినందిస్తున్న కృష్ణారావు, స్వామి

ధర్మపురి: షార్జా గడ్డపై అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం సాధించిన రాష్ట్రానికే గర్వకారణంగా నిలిచిన రంగు విరంచి స్వప్నికను ఆదివారం కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు, గజ్జెల స్వామి అభినందించి సన్మానించారు. భవిష్యత్తులో మరిన్ని పథకాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఆలయ నిర్మాణ దాతలకు సన్మానం

కథలాపూర్: మండలకేంద్రంలో నల్ల పోచమ్మ ఆలయ నిర్మాణానికి ఆర్థికంగా సహకరించిన దాతలను హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. ఆలయ నిర్మాణానికి తాలుక రాజమల్లయ్య, కల్లెడ శంకర్ దాతలుగా సహకరించారన్నారు. గ్రామ దేవతలకు ఆలయాలు నిర్మించడంతో మన సంస్కృతీ సాంప్రదాయాలు భావి తరాలకు తెలుస్తాయని... దాతలను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు తాలుక మల్లేశ్, ప్రధానకార్యదర్శి చెట్పల్లి ప్రసాద్, కోశాధికారి తొగిటి సంతోష్, సాయి, కొండయ్య, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి భూమిపూజ

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలో రూ. 2.50 లక్షల ఎంపీ అర్వింద్ నిధులతో నిర్మించనున్న ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జేఎన్ వెంకట్ భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోరుట్ల నియోజకవర్గంలో దశల వారిగా ఎంపీ అర్వింద్ నిధులతో కుల సంఘ భవనాలు, కమ్యూనిటీ హాల్ నిర్మాణాలకు నిధులు మంజూరు చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రజక సంఘ భవనానికి..

ఇబ్రహీంపట్నం: మండలంలోని గోధూర్‌లో సీడీపీ నిధులు రూ. 4 లక్షలతో నిర్మించనున్న రజక సంఘ భవన నిర్మాణానికి ఆదివారం ఎంపీపీ జాజాల భీమేశ్వరి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ సామ ప్రభాకర్, ఉపసర్పంచ్ తిరుపతిరెడ్డి, నాయకులు ఎడపెల్లిస్వామి, ఆరెల్లి గంగాధర్, ఎడపెల్లి శ్రీనివాస్, నడిపి నర్సయ్య, చిన్న నర్సయ్య పాల్గొన్నారు.

చిత్ర కథ — ప్రమాదకరంగా ఎస్సారెస్పీ వంతెన



పెగడపల్లి: మండలంలోని నందగిరి-పెగడపల్లి రహదారిపై ఉన్న ఎస్సారెస్పీ కాకతీయ ప్రధాన కాలువ వంతెనపై ఇసుక మేటతో పాటు తరుచుగా కురుస్తున్న వర్షపు నీరు నిల్వ ఉండటంతో రాకపోకలకు ఇబ్బందిగా మాయతోందని ప్రయాణికులు వాపోతున్నారు. గతంలో వంతెనకు రెండు వైపుల తారు వేసి వదిలేశారు.ఓ వైపు ఇసుక, మరోవైపు మోకాలి లోతు వర్షపు నీటితో వెళ్లాలంటే ద్విక్ర వాహనాలు అదుపు తప్పి కిందపడే అవకాశాలు ఉన్నాయని వాహనాదారులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఇసుక మేటను తొలగించడంతో పాటు నీరు నిల్వకుండా వంతెనను మరమ్మతు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

ఓటరు నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలి


సవరణలు పరిశీలిస్తున్న తహసీల్దార్ వీర్‌సింగ్


ఇటిక్యాలలో ఓటరు నమోదులో మహిళలు

మల్లాపూర్: ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని తహసీల్దార్ వీర్‌సింగ్ అన్నారు. మండలంలోని కొత్తదాంరాజుపల్లి, సంగెం-శ్రీరాంపూర్, ఒబులాపూర్, మొగిలిపేట, నడికుడ, హుస్సేన్‌నగర్, ముత్యంపేట గ్రామాల్లోని ఆదివారం పోలింగ్ స్టేషన్లను సందర్శించి ప్రత్యేక ఓటర్ నమోదు ప్రక్రియను పరిశీలించి బీఎల్వోలకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గ్రామాల్లో 18 ఏళ్లు నిండిన అర్హులైన యువత నూతన ఓటరుగా నమోదు చేయించుకునేలా బీఎల్వోలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఓటరు నమోదు, సవరణలను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ కాటిపెల్లి సరోజన, వైస్ ఎంపీపీ గౌరు నాగేశ్, సర్పంచ్‌లు బద్దం సరిత, పాలేపు దిలీప్, అలిశెట్టి రవి, వనతడుపుల నాగరాజు, భూక్య రుక్మా, నత్తి లావణ్య, సయ్యద్ హైదర్, బొల్లం కృష్ణవేణి, ఎంపీటీసీలు, ఉపసర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, బీఎల్వోలు, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలో ఓటరు నమోదుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించగా.. 736 మంది ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు ఆదివారం తెలిపారు. కథలాపూర్ మండలంలో 19 గ్రామాలుండగా.. 41 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. ప్రతీ పోలింగ్ బూత్‌లో బీఎల్వోలను అందుబాటులో ఉంచి ఓటరుగా నమోదు చేసుకోవాలని అధికారులు విస్తృతంగా ప్రచారం చేశారు. మండలంలో 35,170 మంది ఓటర్లు ఉండగా.. స్పెషల్ డ్రైవ్‌లో 736 మంది కొత్తగా ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవడం విశేషం. ఆయా గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్‌ను తహసీల్దార్ ముంతాజిబొద్దీన్, ఎంపీడీవో జనార్ధన్ పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు.

అర్హులైన ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలి

రాయికల్: మండలంలోని అన్ని గ్రామాల్లో ఐకేపీ, మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన వారికి ఓటరుగా నమోదుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కాటిపెల్లి గంగారెడ్డి, నాయకులు సామల్ల వేణు, కొమ్ముల ఆదిరెడ్డి, వీవోఏలు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

మేడిపెల్లి: భీమారం మండల కేంద్రంలో ఆదివారం ఓటుహక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ చెక్కపెల్లి అరుణ రఘు, బీఎల్‌వోలు, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

631 దరఖాస్తులు

పెగడపల్లి: మండల వ్యాప్తంగా నూతన ఓటరు నమోదు కోసం 631 చేర్పులు, మార్పుల కోసం 31 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ ఎంఏ ఫరూక్ తెలిపారు. మండలంలోని పెగడపల్లిలో ఆదివారం చేపట్టిన ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాన్ని తహసీల్దార్ ఎంఏ ఫరూక్ సందర్శించారు. ఫామ్–6, ఫామ్–8 దరఖాస్తులను పరిశీలించారు. సెప్టెంబర్ 19 వరకు మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవచ్చని, అక్టోబర్ 4న తుది జాబితా విడుదల చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, బీఎల్‌వోలు భాగ్యమణి, వనజాత పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం కార్యవర్గం ఎన్నిక

ధర్మపురి: విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడిగా రాయపట్నం గ్రామానికి చెందిన పాలాజి జ్ఞానాచారి ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జిల్లా అధ్యక్షుడు టివి సత్యం తెలిపారు. ఈ సందర్భంగా జ్ఞానచారిని పలువురు సన్మానించారు.

వడ్డెర సంక్షేమ సంఘం కార్యవర్గం

కోరుట్లరూరల్: మున్సిపల్ పరిధిలోని ఎకీన్‌పూర్‌లో వడ్డెర సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వేముల వెంకటి, ఉపాధ్యక్షుడిగా బోదాసు మల్లయ్య, కార్యదర్శిగా వేముల నరేశ్, కోశాధికారిగా అలకుంట అశోక్, సహాయ కార్యదర్శిగా బోదాసు గంగారాం, కార్యవర్గ సభ్యులుగా వేముల రాములు, గుంజె వెంకటి, గండికోట రాజం, వేముల చిన్నయ్య, లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు రామిల్ల రాంబాబు,ఎండీ. ముక్రం, దామ రమేశ్ పాల్గొన్నారు.

మోచీ సంఘ కార్యవర్గం ఎన్నిక

మెట్‌పల్లి: పట్టణంలోని మోచీ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బైరి రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా కొండ్లెపు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా కొండ్లెపు సాయన్న, సహాయ కార్యదర్శిగా కావల్ల పెంటయ్య, కోశాధికారిగా గోపి, కార్యవర్గ సభ్యులుగా భాస్కర్, మహేందర్, మధు, రమేశ్‌ను ఎన్నుకున్నారు. అనంతరం వీరిని సంఘం నాయకులు సన్మానించారు.

టీడీపీ మండల అధ్యక్షుడిగా రమేశ్

ఇబ్రహీంపట్నం: తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన గుజ్జుల రమేశ్‌ను నియమించినట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మానుక ప్రవీణ్ ఆదివారం తెలిపారు. ఉపాధ్యక్షుడుగా బోడ రమేశ్, ప్రధాన కార్యదర్శిగా రాదరాపు ప్రకాశ్, కార్యదర్శిగా బైన గణేష్‌ను నియమించినట్లు పేర్కొన్నారు.

బీసీ మహిళా సంక్షేమ సంఘాల ఏర్పాటు


నియామకపత్రం అందిస్తున్న రమేశ్ గౌడ్

కథలాపూర్: జిల్లాలోని అన్ని మండలాల్లో బీసీ మహిళా సంక్షేమ సంఘాలు ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందించినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు యాగండ్ల రమేశ్‌గౌడ్ తెలిపారు. కథలాపూర్‌లో ఆదివారం మాట్లాడారు. భీమారం మండలం బీసీ మహిళ సంక్షేమ సంఘం అధ్యక్షురాలుగా కట్కం జ్యోతి, ఉపాధ్యక్షులుగా ముదిగొండ రవీనా, కార్యదర్శిగా కట్ట భూమక్కను నియమిస్తూ ఉత్తర్వులు అందించారు. సమావేశంలో నాయకులు రాజశేఖర్, ఆంజనేయులు, గణేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.